క్లుప్తంగా

నక్కపల్లి ఎంపీడీవోగా సీతారామరాజు



నక్కపల్లి: స్థానిక మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా(ఎఫ్ఏసీ)గా ప్రస్తుత పరిపాలనాధికారి దెందు కూరి సీతారామరాజు నియమితులయ్యారు. ఇక్కడ ఎంపీడీవోగా పని చేస్తున్న శ్రీనివాసరావు కాకినాడ జిల్లాకు బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో ఏవోగా ఉన్న సీతారామరాజును నియమిస్తూ జిల్లా పరిషత్ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఆయన మంగళవారం బాధ్యతలు చేపట్టారు. మండల పరిషత్ కార్యాలయంలో సుదీర్ఘ కాలంగా సీతారామరాజు వివిధ హోదాల్లో సేవలందిస్తున్నారు. సీతారామరాజు హోం మంత్రి అనితను మర్యాద పూర్వకంగా కలిశారు.

మునగపాక హెచ్‌డీటీగా శేషుబాబు

మునగపాక: మునగపాక రెవెన్యూ కార్యాలయం హెచ్‌డీటీగా వి.శేషుకుమార్ నియమితులయ్యారు. ఇంత వరకు హెచ్‌డీటీగా పని చేసిన వినయ్‌కుమార్‌ను యలమంచిలికి బదిలీ చేశారు. దీంతో రాంబిల్లి మండల హెచ్‌డీటీగా పనిచేసిన శేషుబాబును మునగపాకకు బదిలీ చేశారు. ఈ మేరకు శేషుబాబు మంగళవారం తన చాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం శేషుబాబును పలువురు వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు.

మున్సిపల్ డీఈఈ, ఏఈల నియామకం

యలమంచిలి రూరల్: మున్సిపల్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా జీవీఎంసీలో డీఈఈగా పని చేస్తున్న కేవీ మాధవరావు, జీవీఎంసీలో ఏఈగా విధులు నిర్వర్తిస్తున్న ఎం.నానాజీని యలమంచిలి మున్సిపాలిటీకి బదిలీ చేస్తూ పురపాలక శాఖ ఉన్నతాధికారులు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. యలమంచిలి పురపాలక సంఘంలో డీఈఈగా పని చేస్తున్న కె.వీరయ్యను జీవీఎంసీకి బదిలీ చేశారు. ఖాళీగా ఉన్న ఏఈ పోస్టును నానాజీతో భర్తీ చేశారు.

మునగపాక ఎంపీడీవోగా ప్రసాదరావు



మునగపాక: మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా టీవీఎస్‌వీ ప్రసాదరావు నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా పరిషత్ కార్యాలయం నుంచి ఉత్తర్వులు అందాయి. ఇంతవరకు ఎంపీడీవోగా పనిచేసిన మన్మథరావును శ్రీకాకుళం జిల్లాకు బదిలీ చేసిన విషయం తెలిసిందే. ఈ మేరకు అతని స్థానంలో ఇంత వరకు మండల పరిషత్ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా సేవలందిస్తున్న ప్రసాదరావును ఎంపీడీవోగా నియమిస్తూ ఉత్తర్వులు అందజేశారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా మునగపాక మండల అభివృద్ధికి అందరి సహకారంతో కృషి చేస్తానన్నారు.

యలమంచిలి తహసీల్దార్‌గా వరహాలు



యలమంచిలి రూరల్: మండల తహసీల్దార్‌గా ఎస్.వరహాలు మంగళవారం బాధ్యతలు చేపట్టారు. రోలుగుంట తహసీల్దార్‌గా పని చేస్తున్న ఈయన యలమంచిలికి బదిలీపై వచ్చారు. ఈ మేరకు బాధ్యతలు చేపట్టిన ఆయన అచ్యుతాపురంలో ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ప్రస్తుత యలమంచిలి తహసీల్దార్ ఎస్.రాణిఅమ్మాజీని విశాఖపట్నం కలెక్టరేట్‌లో ప్రత్యేక తహసీల్దార్‌గా పదోన్నతిపై బదిలీ చేశారు. వరహాలుకు పలువురు రెవెన్యూ ఉద్యోగులు, వీఆర్వోలు, వీఆర్ఏలు శుభాకాంక్షలు తెలిపారు.

మునగపాకలో డెంగ్యూ కేసు

మునగపాక: మేజర్ పంచాయతీ మునగపాక మధ్య వీధిలో డెంగ్యూ కేసు నమోదు కావడంతో పంచాయతీ పాలకవర్గం, అధికారులు అప్రమత్తమయ్యారు. సర్పంచ్ దిమ్మల అప్పారావు, వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకున్నారు. పలు చోట్ల బ్లీచింగ్ పిచికారీ పనులు చేపట్టారు. ఏఎన్ఎంలు దేవకి, రేవతి, పంచాయతీ కార్యదర్శి ఈశ్వరరావు పాల్గొన్నారు.

హిస్టరీ అతిథి అధ్యాపకుల భర్తీకి చర్యలు

యలమంచిలి రూరల్: యలమంచిలి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో హిస్టరీ బోధించేందుకు అతిథి అధ్యాపకులు కావల్సి ఉందని కళాశాల ప్రిన్సిపాల్ ఎం.విజయ్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు సంబంధిత సబ్జెక్టుల్లో పీజీ 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత చెంది, ఒరిజనల్ సర్టిఫికెట్స్‌తో కళాశాల కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.



సంపద లేని కేంద్రాలు?

- నిరుపయోగంగా సంపద తయారీ కేంద్రాలు
- పంచాయతీల్లో మూలకు చేరిన స్వచ్ఛ సంకల్పం రిక్షాలు



మూలకు చేరిన చెత్త తరలించే రిక్షా



చినబొడ్డేపల్లిలో పిచ్చిమొక్కలతో సంపద కేంద్రం

కోటవురట్ల: నేనొక గొప్ప విజనరీని.. నేను సంపద సృష్టిస్తా.. ఉద్యోగాలు సృష్టించి ఉపాధి కల్పిస్తా.. పల్లెలను పట్టణాలుగా మార్చేస్తా.. ఈ డైలాగులు ఎవరివో మీకిట్టే అర్థమైపోయి ఉంటుంది. ఈ విజనరీ ప్రభుత్వం వచ్చి 100 రోజులు పూర్తి చేసుకుంది. ఈ 100 రోజుల్లో చేసిందేమీ లేకపోయినా ఇది మంచి ప్రభుత్వం అంటూ గొప్పలు చెప్పుకుంటోంది. పల్లెల్లో మాత్రం దారుణ పరిస్థితులు నెలకొన్నాయి. ఇది రోగాలు ముసురుకునే కాలం. వర్షాలు పడుతుండడంతో పారిశుధ్యం మరింత క్షీణిస్తోంది. పల్లెల్లో ఆరోగ్యకర వాతావరణం ఉండాలంటే, వీధుల్లో చెత్త ఉండకూడదు. చెత్త లేకుండా చేయాలంటే చెత్త నుంచి సంపద కేంద్రాలు పని చేయాలి. సంపద కేంద్రాలు పనిచేస్తే అటు ఆరోగ్యం, ఇటు పంటలు ఏపుగా పెరిగేందుకు అవసరమైన సేంద్రియ ఎరువుకు ఢోకా ఉండదు. తద్వారా పంచాయతీలకు ఆదాయం కూడా సమకూరుతుంది. రాష్ట్రంలో సంపద సృష్టించడం మాటెలా ఉన్నా కనీసం ఈ సంపద కేంద్రాలను వినియోగంలోకి తెచ్చినా కొంత ఆదాయం సమకూరేది. దీనిని కూటమి ప్రభుత్వం పూర్తిగా విస్మరించింది. ఫలితంగా సంపద కేంద్రాలు నిరుపయోగంగా మిగిలిపోయాయి. గత ప్రభుత్వంలో పల్లెలను స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను నిర్మించారు. ఇందుకోసం మండలంలోని 25 పంచాయతీల్లో ఈ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాలకు చెత్తను తరలించేందుకు వీలుగా పారిశుధ్య కార్మికుల కోసం ప్రతి పంచాయతీకి రెండు స్వచ్ఛ సంకల్పం(చెత్తను తరలించే) రిక్షాలను సమకూర్చారు. ఈ రిక్షాల ద్వారా వీధుల్లోని తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి సంపద కేంద్రాలకు తరలించేవారు. అక్కడ తడి చెత్త ద్వారా సేంద్రియ ఎరువును తయారు చేసేవారు. ఈ సేంద్రియ ఎరువును కిలో లెక్కను రైతులకు విక్రయించేవారు. తద్వారా పంచాయతీలకు ఎంతో కొంత ఆదాయం సమకూరేది. ఇదంతా గత ప్రభుతంలో చేపట్టగా.. కూటమి ప్రభుత్వం వచ్చాక ఈ సంపద కేంద్రాలు మూలకు చేరాయి. షెడ్లు, గదులు ఎందుకూ కొరగాకుండా పోయాయి.

ఎక్కడి చెత్త అక్కడే.!

సంపద కేంద్రాలు మూలకు చేరడంతో పల్లెల్లో ఎక్కడి చెత్త అక్కడే దర్శనమిస్తోంది. వీధులు కంపు కొడుతున్నాయి. దోమల వ్యాప్తితో రోగాలు ముసురుకుంటున్నాయి. సంపద కేంద్రాల నుంచి ఆదాయం లేకుండాపోయింది. సేంద్రియ ఎరువు అందుబాటులో లేకపోవడంతో రైతులు ఎరువులను ఆశ్రయించాల్సి వస్తోంది. ఈ ప్రభావం పంటలపై కూడా చూపిస్తోంది. ప్రస్తుతం మండలంలోని సంపద కేంద్రాలు పిచ్చిమొక్కలతో నిండిపోయి ఉన్నాయి. గ్రామాల్లో మాత్రం చెత్తకుప్పలు పేరుకుపోతున్నాయి. స్వచ్ఛ సంకల్పం రిక్షాలు వినియోగంలో లేకపోవడంతో తుప్పపట్టి ఎందుకూ పనికి రాకుండాపోతున్నాయి. ఇప్పటికైనా ఉత్తుత్తి మాటలు కట్టిబెట్టి సంపద సృష్టిని కూటమి ప్రభుత్వం చేతల్లో చూపించాలంటూ విమర్శలు గుప్పుమంటున్నాయి.

కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావాలి..



సంపద కేంద్రాలు వినియోగంలో లేకపోవడంతో ఎందుకూ కొరగాకుండా పోతున్నాయి. పిచ్చిమొక్కలతో అధ్వానంగా ఉన్నాయి. రిక్షాలు మూలకు చేరాయి. సంపద కేంద్రాల వద్ద నీటి సదుపాయం కల్పించి వినియోగంలోకి తీసుకురావాలి. వీటి వల్ల రైతులకు ఎంతో ఉపయోగం ఉంది.

– పైల శివరాం, సర్పంచ్, చినబొడ్డేపల్లి

లక్ష్యం నెరవేరలేదు..



గత ప్రభుత్వంలో సంపద కేంద్రాల ద్వారా పంచాయతీలకు ఆదాయం రావాలని నిర్మించారు. ఇవి వినియోగంలోకి వస్తే రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉండేవి. సేంద్రియ ఎరువు అందుబాటులో ఉండేది. ఇవి మూతపడడంతో గ్రామాల్లో చెత్త పేరుకుపోతోంది. పారిశుధ్య కార్మికులు తమకు సకాలంలో వేతనాలు ఇవ్వడం లేదని చెబుతున్నారు.

– గొర్ల నానిబాబు, యండపల్లి

స్కూల్ గేమ్స్ విజేతలకు బహుమతుల ప్రదానం నేడు



కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు

మునగపాక: మండలంలోని గణపర్తి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో నిర్వహిస్తున్న స్కూల్ గేమ్స్ ఉత్సాహంగా సాగుతున్నాయి. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండల స్థాయిలో పలు పోటీలు నిర్వహిస్తున్నారు. విజేతలకు బుధవారం బహుమతులు అందజేసేందుకు ఏర్పాట్లు చేసినట్లు హైస్కూల్ హెచ్ఎం జయలక్ష్మి తెలిపారు.

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి



ప్రతిభ చూపిన హరిపాలెం హైస్కూల్ విద్యార్థులు

అచ్యుతాపురం(మునగపాక): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని హరిపాలెం హైస్కూల్ హెచ్ఎం శ్రీపాద రవి కోరారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండల స్థాయిలో నిర్వహించిన పలు ఆటల పోటీల్లో ప్రతిభ చూపిన హరిపాలెం హైస్కూల్ విద్యార్థులను మంగళవారం ఆయన అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల్లో రాణించడం ద్వారా ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. విద్యార్థులు రాణించడంలో కృషి చేసిన పీడీ రాజును కూడా హెచ్ఎం అభినందించారు.

క్రీడల్లో జెడ్పీ హైస్కూల్ విద్యార్థుల సత్తా

యలమంచిలి రూరల్: అండర్–17 అథ్లెటిక్స్ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు మంగళవారం బహుమతులు అందజేశారు. 100 మీటర్ల నుంచి 800 మీటర్ల విభాగం రన్నింగ్‌లో స్టేషన్ రోడ్ జెడ్పీ హైస్కూల్ విద్యార్థిని నానేపల్లి దుర్గ ప్రథమ స్థానంలో నిలిచింది. షటిల్ బ్యాడ్మింటన్‌లో కూడా ఆమె ద్వితీయ స్థానంలో నిలిచినట్టు ఉపాధ్యాయులు తెలిపారు. 1500 మీటర్ల బాలుర విభాగంలో హరి, 800 మీటర్ల విభాగంలో జగన్ ఈ పాఠశాల నుంచి ప్రథమ స్థానం కైవసం చేసుకున్నారు. అండర్–14 బాలుర విభాగంలో షటిల్‌లో ద్వితీయ, చెస్‌లో ప్రథమ స్థానంలో హైస్కూల్ విద్యార్థులు సత్తా చాటారు.

సమస్యలపై ఏకరువు



మాట్లాడుతున్న ఎంపీడీవో సత్యనారాయణ

ఎస్.రాయవరం: సమస్యలు చెప్పుకోవడం తప్ప పరిష్కారానికి నోచుకోవడం లేదని పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు ఏకరువు పెట్టారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కోన లోవలక్ష్మి అధ్యక్షతన మంగళవారం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. సర్వసిద్ధి పీహెచ్‌సీలో వైద్య సిబ్బంది తీరు మారలేదని, నిత్యం రోగులు ఇబ్బందులు పలువురు సమావేశం దృష్టికి తీసుకెళ్లారు. నీటి పారుదల శాఖలో కూడా గడిచిన కొన్నేళ్లు గ్రోయిన్ల మరమ్మతుల విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం కాలేదన్నారు. బంగారమ్మపాలెంలో జల జీవన్ మిషన్ కింద నిర్మించిన ట్యాంకును ఎందుకు ప్రారంభించలేదని సర్పంచ్ మైలపల్లి శ్రీనివాసరావు ప్రశ్నించారు. గ్రామాల్లో పైపులైన్ల పనుల కోసం కాంట్రాక్టర్ రోడ్లను తవ్వేశారని, వాటిని పునర్నిర్మిస్తామని చెప్పి నేటికీ పనులు చేపట్టలేదన్నారు. దీంతో గ్రామస్తులు నిత్యం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఎస్.రాయవరం ఎంపీటీసీ సభ్యులు బొలిశెట్టి గోవిందరావు, బైపా శ్రీనివాసరావు తెలిపారు. రేవుపోలవరం, ఎస్.రాయవరం ఆర్అండ్‌బీ రోడ్లు ఆక్రమణకు గురయ్యాయని, బస్సులు, భారీ వాహనాలు వచ్చినప్పుడు ఆక్రమణలు జరిగిన చోట ట్రాఫిక్ సమస్య తలెత్తుతోందని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు ఇన్‌చార్జ్ ఎంపీడీవో సత్యనారాయణ మాట్లాడుతూ సమస్యలను పరిష్కరించేందుకు ఆయా శాఖల అధికారులు కృషి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు కాకర దేవి, వైస్ ఎంపీపీలు బొలిశెట్టి గోవిందరావు, చోడిపల్లి అప్పలరాజు, డిప్యూటీ తహసీల్దార్ స్వామి, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

నెలవారీ పదోన్నతులు చేపట్టాలి



మాట్లాడుతున్న యూటీఎఫ్ ప్రధాన కార్యదర్శి చిన్నబ్బాయి

కోటవురట్ల: రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగంలో నెలవారీ పదోన్నతులు చేపట్టాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చిన్నబ్బాయి డిమాండ్ చేశారు. మండలంలోని యూటీఎఫ్ సభ్యులను మంగళవారం ఆయన కలుసుకుని సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024 జనవరి నెల తర్వాత వివిధ స్థాయిలో చాలా మంది పదవీ విరమణ పొందడంతో ఖాళీలు ఏర్పడ్డాయన్నారు. చాలా పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల కొరత ఉందన్నారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో సుమారు 30 మంది హెచ్ఎంలు పదవీ విరమణ చేశారని, ఆ ఖాళీలను నేటికీ భర్తీ చేయలేదన్నారు. ప్రస్తుతం పనిచేస్తున్న హెచ్ఎంలు మండల ఎఫ్ఏసీ అధికారులుగా నియమితులు కావడం వల్ల చాలా పాఠశాలలు హెచ్ఎంలు లేకుండానే నడుస్తున్నాయని తెలిపారు. నెలవారీ పదోన్నతులతో ఈ సమస్యకు పరిష్కారం లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ జిల్లా సహ అధ్యక్షురాలు పి.గాయత్రి, మండల అధ్యక్ష, కార్యదర్శులు నరసింగరావు, జంగా వరప్రసాద్, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యుడు గంటేడ అప్పలరాజు, సీనియర్ నాయకులు చిట్టియ్య, ఈశ్వరరావు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం



బహుమతులతో విద్యార్థులు

యలమంచిలి రూరల్: యలమంచిలి మండల స్థాయి స్కూల్ గేమ్స్ పోటీల్లో గెలుపొందిన విజేతలకు కొత్తపేట హైస్కూల్‌లో మంగళవారం బహుమతులు ప్రదానం చేశారు. ముఖ్య అతిథులుగా పట్టణ జనసేన నాయకులు బొద్దపు శ్రీను, కొఠారు నరేష్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు గొర్లి నానాజీ హాజరయ్యారు. క్రీడాకారులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం వైవీ రమణ, పీడీలు పాల్గొన్నారు.

మరిడిమాంబ అమ్మవారి పండగ రేపు

మునగపాక: మండల కేంద్రమైన మునగపాకలో గురువారం మరిడిమాంబ అమ్మవారి పండగను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు సర్పంచ్ దిమ్మల అప్పారావు, ఉత్సవ కమిటీ చైర్మన్ వేగి కృష్ణ తెలిపారు. ఉదయం నుంచి అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. మునగపాకకు చెందిన లక్ష్మీ కళా యూనియన్ ఆధ్వర్యంలో మందబయిల రామాలయం వద్ద సమరానికి సై సాంఘిక నాటిక ప్రదర్శన ఉంటుందన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని వారు కోరారు.

మహిళా కబడ్డీ పోటీలను విజయవంతం చేయాలి



మునగపాకలోని రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల స్థలాన్ని పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్

మునగపాక : మునగపాకలో రెండు రోజుల పాటు నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి మహిళా కబడ్డీ పోటీలను విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ కోరారు. మునగపాక నందీశ్వర ప్రాంగణంలో ఫ్లడ్‌లైట్ల వెలుగుల్లో పోటీలు నిర్వహిస్తున్న స్థలాన్ని మంగళవారం రాత్రి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పలు జిల్లాల నుంచి వచ్చే క్రీడాకారులకు ఘనంగా స్వాగతం పలకాలన్నారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు, మునగపాక సర్పంచ్ దిమ్మల అప్పారావు, ఉత్సవ కమిటీ చైర్మన్ వేగి కృష్ణ, నిర్వాహకులు ఆడారి కాశీబాబు, ఆడారి రమణబాబు, పెంటకోట శ్రీనివాసరావు, కోనపల్లి రామ్మోహనరావు, టెక్కలి కొండలరావు, ఆడారి సూరిబాబు, దాసరి అప్పారావు, పెంటకోట ఆదినారాయణ, ఆడారి కృష్ణ, సూరిశెట్టి దుర్గునాయుడు, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ముగ్గుల పోటీలు

నక్కపల్లి: వినాయక చవితి వేడుకల్లో భాగంగా నక్కపల్లి కొత్తపేటలో ఉన్న కృష్ణా క్లబ్ ఆవరణలో మంగళవారం మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని వివిధ రకాల ముగ్గులు వేసి, ఆకట్టుకున్నారు. విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు కన్సొలేషన్ బహుమతులు కూడా అందజేశారు.

తీరంలో స్వచ్ఛత హీ సేవ



తీరంలో చెత్తను ఏరివేస్తున్న విద్యార్థులు

పాయకరావుపేట: స్థానిక శ్రీప్రకాష్ విద్యా సంస్థల అనుబంధ సంస్థ స్పేసెస్ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు స్వచ్ఛత హీ సేవ కార్యక్రమం నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో భాగంగా పాల్మన్‌పేట బీచ్‌లో పేరుకుపోయిన వ్యర్థాలు, ప్లాస్టిక్ కవర్లను తొలగించారు. అనంతరం విద్యార్థులు స్వచ్ఛభారత్ ప్రతిజ్ఞ చేశారు. అందరూ పర్యావరణాన్ని కాపాడాలని, అది మనల్ని కాపాడుతుందని నినదించారు. ఈ కార్యక్రమంలో సుమారు 100 మంది విద్యార్థులు, ప్రోగ్రాం ఆఫీసర్లు పి.భాస్కరరావు, జి.తాతాయ్యనాయుడు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

యలమంచిలి రూరల్: పురుషోత్తపురం జెడ్పీ హైస్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు మంగళవారం ఎన్ఎంఎంఎస్ స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. వింగ్స్ ఫౌండేషన్ కార్యదర్శి ఎం.జయప్రకాష్ మాట్లాడుతూ ఈ స్టడీ మెటీరియల్ చదివి పరీక్షల్లో విద్యార్థులు అర్హత సాధించాలని ఆకాంక్షించారు. అర్హత సాధించిన ప్రతి విద్యార్థికి సంవత్సరానికి రూ.12 వేలు ఉపకార వేతనం లభిస్తుందని చెప్పారు. విద్యార్థులకు పరీక్ష రుసుం కూడా వింగ్స్ ఫౌండేషన్ చెల్లిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్ఎం మల్లిపాటి సత్యనారాయణ, వింగ్స్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ఎం.ఆనంద్, ఉపాధ్యాయులు కె.సుధారాణి, సీహెచ్.నాగరత్నం, బి.అనురాధ, నస్రీన్, జి.సర్వేశ్వరరావు పాల్గొన్నారు.

జీతం, బోనస్ అందించాలి

అచ్యుతాపురం(మునగపాక): ఎస్ఈజెడ్ ఫార్మా కంపెనీల్లో పనిచేసే కార్మికులందరికీ 20 శాతం బోనస్‌ను అక్టోబర్ నెల జీతంతో పాటు చెల్లించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్.రాము, మండల కన్వీనర్ సోమునాయుడు డిమాండ్ చేశారు. మంగళవారం వారు విలేకరులతో మాట్లాడారు. కార్మిక చట్టం ప్రకారం మార్చినాటికి ప్రతి కంపెనీ యాజమాన్యం బ్యాలెన్స్ షీటు తయారు చేసి నోటీసు బోర్డులో ఉంచాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా కమిటీ సభ్యులు ఆర్.సత్తిబాబు, నూకునాయుడు, అప్పలరాజు, శ్రీనివాసరావు, మామిడి నాయుడు పాల్గొన్నారు.

పిల్లల భద్రతకు ప్రాధాన్యమివ్వాలి

యలమంచిలి రూరల్: పాఠశాలలకు పిల్లలను తీసుకెళ్లే ఆటో డ్రైవర్లు నిబంధనలు పాటించాలని ట్రాఫిక్ ఎస్ఐ బి.రామకృష్ణ సూచించారు. మంగళవారం ఆటో డ్రైవర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ ఆటోల్లో పిల్లలను పరిమితికి మించి తీసుకెళ్లకూడదని హెచ్చరించారు. పిల్లల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. నిబంధనలు పాటించకపోతే కేసులు నమోదు చేసి, ఆటోలు సీజ్ చేస్తామని హెచ్చరించారు.

త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం

పాయకరావుపేట: పాల్తేరు గ్రామంలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞాన వేదిక రాజమండ్రి కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో మంగళవారం త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం చేశారు. ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు రచించిన ఆధ్యాత్మిక త్రైత సిద్ధాంత గ్రంథాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక – రాజమండ్రి కమిటీ ఉపాధ్యక్షుడు, సభ్యులు శాంతరాజు, సోమినాయుడు, నాగేశ్వరరావు, సత్యవతి, వ్యాస్ జలంధర్ తదితరులు పాల్గొన్నారు.

ఈ-పంట నమోదు తప్పనిసరి



ఏటికొప్పాకలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్

యలమంచిలి రూరల్: రైతులు ఈ-పంట నమోదు చేసుకోవడం ఎంతో అవసరమని, ఈ-కేవైసీ చేయడం ద్వారా ఉచిత పంటల బీమా పథకాన్ని పొందవచ్చునని ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ తెలిపారు. మండలంలోని ఏటికొప్పాక, బయ్యవరం గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వ్యవసాయ యాంత్రీకరణలో భాగంగా ప్రభుత్వం రాయితీపై అందించే డ్రోన్‌లను తీసుకోవాలన్నారు. పాడి పశువుల షెడ్ల నిర్మాణానికి ఉపాధి హామీ పథకం కింద 90 శాతం రాయితీ లభిస్తుందని చెప్పారు. అనంతరం ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల ప్రదర్శనను తిలకించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రావు, వ్యవసాయ శాఖాధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఎస్.రాయవరం: వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకునేందుకు సాగులో మెలకువలు పాటించాలని మండల వ్యవసాయాధికారి సౌజన్య అన్నారు. పెట్టుగోళ్లపల్లి, దార్లపూడి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఖరీఫ్ సాగులో చీడపీడలు నివారణపై అవగాహన కల్పించారు.

వరి సాగుపై అవగాహన అవసరం

పాయకరావుపేట: వరి సాగుపై రైతులు అవగాహన పెంచుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి పి.ఆదినారాయణ అన్నారు. నామవరం గ్రామంలో పొలం-పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు వరి పంటను నాటిన దగ్గర నుంచి శ్రద్ధ వహించి తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడి వచ్చేలా తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అనంతరం క్షేత్ర ప్రదర్శన చేపట్టారు. ఈ కార్యక్రమంలో నీటి పారుదల శాఖ ఏఈ శ్రీరామమూర్తి, వ్యవసాయ శాఖ, ఆర్ అండ్ బీ సిబ్బంది పాల్గొన్నారు.

రైతుల సమస్యలు పరిష్కరించాలి



ఏలేరు కాలువపై వంతెనను పరిశీలిస్తున్న జోగులు, సూర్యనారాయణరాజు

కోటవురట్ల: రైతుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు కోరారు. పాములవాక శివారు ఏలేరు కాలువపై నిర్మించిన వంతెనను మంగళవారం ఆయన రైతులతో కలిసి పరిశీలించారు. గత ప్రభుత్వంలో ఏలేరు కాలువపై జీవీఎంసీ నిధులు రూ.2.30 కోట్లతో వంతెన నిర్మించారు. రైతులు రాకపోకలు సాగించేందుకు నిర్మించిన ఈ వంతెన బాగా దిగువకు ఉండడంతో వర్షాలు అధికమైనప్పుడు సమీపంలో ఉన్న చెరువునీరు వెనుకు వచ్చి వంతెన మీదుగా ప్రవహించడంతో రైతులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రాగానే ప్రజాప్రతినిధుల కృషితో జీవీఎంసీ వంతెన నిర్మాణాన్ని చేపట్టి 2024లో ప్రారంభించింది. అధికారుల నిర్లక్ష్యం కారణంగా పాత నమూనాలోనే మళ్లీ వంతెన నిర్మాణం చేపట్టడంతో ఉపయోగం లేకుండా పోయింది. చెరువునీరు వెనక్కి ఎగపారడంతో వంతెనపై పీకల్లోతులో ప్రవహిస్తోంది. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం సూపర్‌పాసేజ్ ద్వారా నీరు నిల్వ లేకుండా చేయాలని, చెరువు పొర్లుగట్టు దగ్గర ఐరన్ గ్రిల్ ఏర్పాటు చేసి రైతులకు రక్షణ కల్పించాలని కోరుతున్నారు. ఈ నేపథ్యంలో మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు, మాజీ ఎమ్మెల్సీ డి.వి.సూర్యనారాయణరాజు వంతెన ప్రాంతాన్ని పరిశీలించారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని వారు హామీ ఇచ్చారు.

చందనకు విట్ డాక్టరేట్

మునగపాక: మండలంలోని నాగులాపల్లికి చెందిన టెక్కలి చందన మంగళవారం డాక్టరేట్ అందుకున్నారు. విశాఖలోని రఘు ఇంజినీరింగ్ కళాశాలలో చందన అసోసియేట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్నారు. అమరావతిలోని విట్ యూనివర్సిటీలో కృత్రిమ మేధ(ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్) అనే అంశంపై చేసిన పరిశోధనకు ఆమెకు పీహెచ్‌డీ లభించింది. ఈ మేరకు మంగళవారం అమరావతిలో జరిగిన వర్సిటీ స్నాతకోత్సవంలో వీసీ విశ్వనాథం నుంచి చందన గౌరవ డాక్టరేట్‌ను స్వీకరించారు. ఆమె తల్లితండ్రులు నూకరాజు, దుర్గ స్థానికంగా ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ నిర్వహిస్తూ కుటుంబ పోషణ సాగిస్తున్నారు. చందన డాక్టరేట్ సాధించడంపై కుటుంబ సభ్యులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

చినదొడ్డిగల్లు అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ



అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఎంపీడీవో సీతారామరాజు

నక్కపల్లి: మండలంలో చినదొడ్డిగల్లు అంగన్‌వాడీ కేంద్రాన్ని ఎంపీడీవో సీతారామరాజు మంగళవారం తనిఖీ చేశారు. హాజరు పట్టీని పరిశీలించారు. కేంద్రానికి ఎంత మంది పిల్లలు వస్తున్నారు.. నిర్ణీత వేళల ప్రకారం కేంద్రాన్ని తెరుస్తున్నారా? లేదా? అని ఆరా తీశారు. పిల్లలకు పౌష్టికాహారం నాణ్యతతో రుచిగా పెట్టాలని ఆదేశించారు. పిల్లల సంఖ్య పెంచాలని, గర్భిణులు, బాలింతలకు ప్రభుత్వం సరఫరా చేసే పోషకాహారాన్ని సక్రమంగా అందజేయాలని సూచించారు. రికార్డులను సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. ఈ తనిఖీల్లో ఈవోపీఆర్డీ సత్యనారాయణ, ఐసీడీఎస్ సిబ్బంది లలిత, తదితరులు పాల్గొన్నారు.



